

అభివృద్ధే బీఆర్ఎస్ లక్ష్యం

అన్నివర్గాల ప్రజల అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వెల్లడించారు. 8లో



కొణిజర్లలో ఇరువర్గాల ఘర్షణ

కొణిజర్లలో సర్పంచ్‌పై యువకులు దాడికి యత్నించగా సర్పంచ్ వర్గీయులు ఎదురుదాడికి దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 8లో



వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. సాయంత్రం తర్వాత వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

సత్ప్రవర్తనతో మెరుగైన జీవితం



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జడ్జి అమరావతి

ఖమ్మంరూరల్: మహాత్మాగాంధీ అవలంబించిన శాంతి, అహింసా మార్గం అందరికీ అనుసరణీయమని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అమరావతి తెలిపారు. మండలంలోని రామన్నపేటలోని జిల్లా జైలు ఆవరణలో సోమవారం గాంధీ జయంతి సందర్భంగా ఆమె గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన ఖైదీల సంక్షేమ దినోత్సవంలో జడ్జి మాట్లాడుతూ తెలిసోతెలియకో నేరంతో శిక్ష అనుభవిస్తున్న వారు ప్రవర్తనలో మార్పు తెచ్చుకుంటే ఆతర్వాత జీవితం బాగుంటుందని తెలిపారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి మహ్మద్ అబుదల్ జావేద్ పాషా, జైలు సూపరింటెండెంట్ శ్రీధర్ మాట్లాడగా జైలర్లు అజ్మీరా సక్రునాయక్, జి.లక్ష్మీనారాయణ, డాక్టర్ వై.సిద్ధార్థ్, ఏసీపీ హరికృష్ణ పాల్గొన్నారు.

వయోవృద్ధులకు అండగా న్యాయ సేవా సంస్థ

ఖమ్మంలీగల్: వయోవృద్ధుల రక్షణ, పోషణతో పాటు వారి ఆరోగ్య సంరక్షణ విషయంలో న్యాయ సేవాధికార సంస్థ అండగా ఉంటుందని సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా తెలిపారు. గాంధీ జయంతి పురస్కరించుకుని సోమవారం న్యాయ సేవా సంస్థ, శ్రీ రక్షా హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యాన నగరంలోని వృద్ధాశ్రమాల్లోఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులను పరీక్షించి ఉచితంగా మందులు అందచేశారు. అనంతరం జావేద్‌పాషా మాట్లాడుతూ వృద్ధుల పోషణను పిల్లలు నిరాకరిస్తేన్యాయసేవా సంస్థ ద్వారా న్యాయసాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరక్ష హాస్పిటల్ వైద్యులు ఏడుకొండలు, అల్తాఫ్‌తో పాటు రవి, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఐఏ దాడులు గర్హనీయం

ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: రెండు తెలుగు రాష్ట్రాల్లో పౌర, ప్రజాస్వామిక హక్కుల కోసం పనిచేస్తున్న వారి ఇళ్లపై ఎన్‌ఐఏ అధికారులు దాడులు గర్హనీయమని, ఈ దాడులను సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎల్‌సీ నాయకుడు శ్రీమన్నారాయణ సహా మహిళా కార్యకర్తల ఇళ్లలో సోదాలు చేస్తూ భయానక వాతావరణం కల్పిస్తున్నారని ఆరోపించారు. ఫాసిజానికి వ్యతిరేకంగా, ప్రజల హక్కుల కోసం మాట్లాడడాన్ని నేరంగా పరిగణిస్తున్నారని తెలిపారు. మాట, పాట, రాతపై మోడీ నిషేధాన్ని విధించి భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తున్నారని విమర్శించారు. ఇకనైనా పౌర ప్రజాస్వామిక హక్కుల కోం పోరాడుతున్న వారి ఇళ్లపై దాడులు నిలిపేసి అక్రమ కేసులు నమోదు చేయడాన్ని మానుకోవాలని రంగారావు సూచించారు.

జాతీయ స్థాయి యోగా పోటీల్లో బంగారు పతకం



ఝాన్సీలక్ష్మి

కొణిజర్ల: ఇటీవల గోవాలో నిర్వహించిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో కొణిజర్ల మండలం తనికెళ్లకు చెందిన యోగా గురువు లేడి బోయిన ఝాన్సీలక్ష్మి బంగారు పతకం గెలుచుకుంది. యూత్ అండ్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్' గవర్నమెంట్ సంయుక్త ఆధ్వర్యాన జాతీయ స్థాయి యోగా పోటీలు ఏర్పాటుచేశారు. ఈపోటీల్లో ప్రభుత్వ ఉపాధ్యాయుడైన రామన అచ్యుత్ భార్య ఝాన్సీలక్ష్మి ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించింది. ఆమెను అసోసియేషన్ ప్రెసిడెంట్ అభిలాష్‌కుమార్, జనరల్ సెక్రటరీ రాజుకే భారతి, స్పోర్ట్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ విద్య హీరామత్ అభినందించారు. కాగా, అందుకుంది, గోల్డు మెడల్ సాధించినందుకుగాను పలువురు ఝాన్సీని అభినందించారు.

6న లకారంలో డ్రోన్ షో

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలోని లకారం ట్యాంక్ బండ్ వద్ద ఎన్టీఆర్ పార్కులో ఈనెల 6న డ్రోన్ షో నిర్వహించనున్నారు. మంత్రి అజయ్‌కుమార్ సూచనలతో ఈ కార్యక్రమం ఏర్పాటుచేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డ్రోన్ల లైటింగ్ ద్వారా ఆకాశంలో వివిధ అకృతులు, మహనీయుల బొమ్మలు, చారిత్రక నిర్మాణాలను ప్రదర్శిస్తామని వారు ఓ ప్రకటనలో వెల్లడించారు.

మళ్లీ తెరపైకి కొత్త జిల్లా

సత్తుపల్లి కేంద్రంగా ఏర్పాటుకు ఏళ్లుగా డిమాండ్

- గతంలో జేఏసీ ఆధ్వర్యాన ఆందోళనలు
- అశ్వారావుపేటతో కలిపి ఏర్పాటుచేస్తే దూరాభారం తగ్గుతుందని వెల్లడి
- తాజా పర్యటనలో మంత్రి కేటీఆర్ ప్రస్తావన
- ఈసారి ఎన్నికల నినాదంగా మారే అవకాశం



సత్తుపల్లి: రాష్ట్రంలోని మరెక్కడా లేనంతగా ఆయిల్ పామ్ తోటలు.. రెండు పామాయిల్ ఫ్యాక్టరీలు.. కొబ్బరి తదితర ఉద్యాన పంటలు.. వందల ఎకరాల్లో మామిడి నర్సరీలు.. అపారమైన బొగ్గు నిక్షేపాలు.. ఇలా చెప్పుకుంటూ పోతే సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. గతంలో ఒకే నియోజకవర్గంగా ఉన్న ఇవి పునర్విభజన అనంతరం రెండుగా విడిపోయాయి. అశ్వారావుపేట నుంచి కొత్తగూడేనికి, సత్తుపల్లి నుంచి ఖమ్మంకు రావాలంటే దూరాభారమని ప్రజలు భావిస్తారు. ఈ నేపథ్యాన రెండు నియోజకవర్గాలను కలుపుతూ సత్తుపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పాటుచేయాలనే డిమాండ్ ఏళ్లుగా ఉంది. కానీ ప్రభుత్వం 33 జిల్లాల ఏర్పాటు తర్వాత మళ్లీ ఊసెత్తకపోవడంతో అంతా సద్దుమణిగింది. అయితే, ఇటీవల సత్తుపల్లి సభకు వచ్చిన మంత్రి కేటీఆర్.. వెంకటవీరయ్యను 60వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలిపిస్తే జిల్లా డిమాండ్‌ను నెరవేర్చుకునేలా సీఎం కేసీఆర్ మనసు గెలుచుకోవచ్చని చెప్పడంతో మళ్లీ సత్తుపల్లి జిల్లా అంశం తెరపైకి వచ్చింది.

గత ఉద్యమంలో కీలకంగా 'సండ్ర'

రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఇటీవల సత్తుపల్లి పర్యటనలో ఎమ్మెల్యేగా సండ్ర వెంకటవీరయ్యను 60 వేల నుంచి 70వేల ఓట్ల మెజార్టీతో గెలిపిస్తే సత్తుపల్లి జిల్లా అంశాన్ని సీఎం కేసీఆర్‌తో చర్చిస్తామని చెప్పడంతో చర్చ మొదలైంది. గతంలో జిల్లా సాధనకు ఉవ్వెత్తున ఉద్యమం సాగగా.. అందులో కీలకంగా పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య ఇప్పుడు మంత్రి కేటీఆర్‌తో ప్రకటన చేయించడం విశేషం. కాగా, కాంగ్రెస్ నేతలు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్, కొండూరు సుధాకర్, కోటూరి మానవతారాయ్ తదితరులు సైతం జిల్లా ఏర్పాటు ఉద్యమానికి మద్దతు ఇస్తామని ఇప్పటికే ప్రకటించారు. అంతేకాకుండా తాజాగా సత్తుపల్లికి చెందిన న్యాయవాదులు జిల్లా ఏర్పాటుకు డిమాండ్ చేయటం.. ఇటీవల పర్యటనలో కేటీఆర్ ప్రస్తావించడంతో స్థానికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



షాపుల్లో ఏర్పాటు చేసిన పోస్టర్లు

ములుగు జిల్లా చేయడంతో..

జిల్లాల పునర్విభజన సమయాన సత్తుపల్లిని జిల్లాగా ఏర్పాటు చేయాలంటూ ఉద్యమం చేపట్టారు. అయితే, 32 జిల్లాల ఏర్పాటుతో ఈ ప్రక్రియ ముగిసిందని, మళ్లీ ఎక్కడైనా జిల్లా ఏర్పాటు చేస్తే సత్తుపల్లి అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటామని జిల్లా పునర్విభజన కమిటీ అప్పట్లో హామీ ఇచ్చింది. ఇకఅప్పటి అధికార పార్టీ నేతలు సత్తుపల్లి జిల్లా ప్రాధాన్యత, స్థానికుల డిమాండ్‌ను సీఎం కేసీఆర్‌కు వివరించడంలో వెనుకబడడంతో ఫలితం దక్కలేదు. కానీ 2018 ఎన్నికల ప్రచారంలో సీఎం కేసీఆర్ ములుగు సభలో టీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే ములుగు జిల్లా చేస్తామని హామీ ఇవ్వగా, సత్తుపల్లి ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు కేసీఆర్ దృష్టికి జిల్లా అంశాన్ని తీసుకురావాలని యత్నించినా సాధ్యం కాలేదు. దీంతో సీఎం ఎలాంటి హామీ ఇవ్వలేదు. అయితే, అసెంబ్లీ ఎన్నికల తర్వాత ములుగుతో పాటు నారాయణపేటను కూడా జిల్లాలుగా చేసినా సత్తుపల్లి జిల్లాను సాధించడంలో మాత్రం ఇక్కడి నేతలు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి.

129 రోజుల పాటు దీక్షలు

సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలను కలిపి సత్తుపల్లి జిల్లా చేయాలని రాజకీయ జేఏసీ ఆధ్వర్యాన 2016 అక్టోబర్ 29 నుంచి 129 రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేశారు. రెండుసార్లు సత్తుపల్లి బంద్ కూడా చేపట్టగా వంటావార్పు, రాస్తారోకో తదితర ఆందోళనలు జరిగాయి. అలాగే, 175 గ్రామపంచాయతీల్లో తీర్మానాలు కూడా చేశారు. రెండు నియోజకవర్గాల్లోని పది మండలాలను కలిపి సత్తుపల్లి కేంద్రంగా జిల్లా చేయాలనే డిమాండ్‌తో ఉధృతంగా ఆందోళనలు చేపట్టారు. రెండు నియోజకవర్గాల్లోని పది మండలాలను విడదీసి గంగారం, లంకపల్లి, మొద్దులగూడెం, చెన్నూరు, కుర్నవల్లి, పట్వారిగూడెం, వినాయకపురం కేంద్రాలుగా కొత్త మండలాలు ఏర్పాటుచేసి 17 మండలాలతో జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విస్తీర్ణం 5.47 లక్షల చదరపు మీటర్ల పైచిలుకు ఉండడం, అశ్వారావుపేట నుంచి కొత్తగూడెంకు.. సత్తుపల్లి నుంచి ఖమ్మంకు వెళ్లాలంటే 80 కి.మీ. నుంచి 120 కి.మీ. ఉండడంతో దూరాభారం తగ్గడానికి జిల్లా ఏర్పాటే మార్గమని ప్రతిపాదించారు. కాగా, జిల్లా సాధన కోసం జేఏసీ ఆధ్వర్యాన చేపట్టిన పాదయాత్రను తల్లాడలో అడ్డుకుని నమోదు చేసిన కేసును గత నెల 13న జిల్లా కోర్టు కొట్టివేసింది.



సత్తుపల్లి డిపో వద్ద ఆందోళనలో ఎమ్మెల్యే వెంకటవీరయ్య, జేఏసీ నాయకులు (ఫైల్)

గాంధీ పోరాటం స్ఫూర్తిదాయకం



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పువ్వాడ, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, కలెక్టర్ గౌతమ్ తదితరులు

రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: దేశ ప్రజల స్వేచ్ఛాస్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ అలుపెరగక చేసిన పోరాటం ఎందరికో స్ఫూర్తిగా నిలిచిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా ఖమ్మం గాంధీ చౌక్‌లో ఆయన విగ్రహానికి మంత్రి పువ్వాడ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అహింసా మార్గంలో ఏదైనా సాధించొచ్చని నిరూపించిన గాంధీ స్ఫూర్తిగా కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని తెలిపారు. గాంధీ కలలకు అనుగుణంగా తెలంగాణలో పాలన సాగుతోందని, పల్లెలను అన్నిరంగాల్లో తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్, ఆర్డీవో జి.గణేష్, తహసీల్దార్ సీహెచ్.స్వామి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇద్దరూ సమన్వయంతో ఉన్నారు..

- విజయానికి అందరూ కలిసి పనిచేయాలి
- ఎంపీ నామా నాగేశ్వరరావు

వైరా: వైరాలో ఎమ్మెల్యే రాములునాయక్, బీఆర్ఎస్ అభ్యర్థి బానోతు మదన్‌లాల్ సమన్వయంతో పనిచేస్తున్నందున రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మదన్‌లాల్ మంచి మెజార్టీతో గెలవడం ఖాయమని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. వైరాలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ అంతా కలిసిమెలిసి పనిచేసి మదన్‌లాల్ గెలుపునకు కృషి చేయాలన్నారు. గ్యారంటీల పేరిట వస్తున్న కాంగ్రెస్ నాయకులను వారి పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు అమలుచేయడం లేదో నిలదీయాలని సూచించారు. కాగా, కాంగ్రెస్, బీజేపీల నేతల మాయమాటలు నమ్మితే నష్టపోతారనే విషయాన్ని గుర్తించాలని ఎంపీ తెలిపారు.

మేం కృష్ణార్జునులం

'మా బావ(రాములునాయక్) కృష్ణుడైతే నేను అర్జుడిని' అని పేర్కొన్న మదన్‌లాల్.. కురుక్షేత్ర సంగ్రామం మాదిరి వచ్చే ఎన్నికల్లో తనను రాములునాయక్ నడిపిస్తారని తెలిపారు. వెన్నుపోటు రాజకీయాలతో గత ఎన్నికల్లో ఓడిపోయానని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తనకు టికెట్ రాకపోవడం పెద్ద విశేషమేమీ కాదని చెబుతూ... గత ఎన్నికల్లో అన్యాయంగా గెలవలేదని, ప్రజలు ఓట్లేస్తేనే విజయం సొంతమైందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తన శ్వాస, ఆశ అన్నీ కూడా బీఆర్ఎస్ గెలుపేనని చెప్పారు. కేసీఆర్ సూచనలు పాటించకపోతే చరిత్రలో తప్పు చేసిన వారమవుతామని, తన బావ మదన్‌లాలే రిటైర్‌మెంట్ ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు, మార్కెట్ చైర్మన్ పసుపులేటి మోహనరావు, ఎంపీపీ పావని, జెడ్పీటీసీ కనకదుర్గ, మున్సిపల్ వైస్‌చైర్మన్ సీతారాములుతో పాటు కృష్ణార్జునరావు, లాల్‌మహ్మద్, కొత్త వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ నాగేశ్వరరావు, పక్కన రాములునాయక్, మదనల్‌లాల్ తదితరులు

అధికారంలోకి వస్తాం.. గ్యారంటీలు అమలుచేస్తాం

సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

బోనకల్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, ఆతర్వాత వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలుచేయడం ఖాయమని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. మండలంలోని కలకోట, జానకీపురం గ్రామాల్లో సోమవారం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు ప్రతీ ఇంటికి వెళ్లి గతంలో కాంగ్రెస్ అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఈ సారి అధికారంలోకి వస్తే నెరవేర్చనున్న హామీలను వివరించాలని సూచించారు. ప్రతీ మహిళకు రూ.2,500, ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ.15వేలు, భూమి లేని రైతులకు రూ.12 వేలు ఇవ్వడమే కాక ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తామనే తదితర హామీలను గడపగడపకూ తీసుకెళ్లాలని తెలిపారు. ఈసమావేశాల్లో జెడ్పీటీసీ మోదుగు సుధీర్‌బాబు, సర్పంచ్ యంగల దయామణి, నాయకులు పైడిపల్లి కిషోర్, బందం నాగేశ్వరావు, గాలి దుర్గారావు, కర్నాటి కోటి, పిల్లలమర్రి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ

చింతకాని: ప్రజలు ఆశించిన బంగారు తెలంగాణ కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో అనంతసాగర్‌కు చెందిన సీపీఎం, తదితర పార్టీలకు చెందిన 25 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరాయి. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకరావటం కోసమే కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను ప్రకటించిందని, అధికారంలోకి వచ్చిన వెంటనే వీటిని తప్పక అమలుచేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పడి పదేళ్లు గడిచినా బీఆర్ఎస్ తీరుతో పేదల బతుకులు మారలేదన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు అంబటి వెంకటేశ్వర్లు, కన్నెబోయిన గోపి, మడుపల్లి భాస్కర్, కూరపాటి కిషోర్, కొప్పుల గోవిందరావు, బందెల నాగార్జున్, సట్టు వెంకటేశ్వర్లు, తిరుపతి గోవిందరావు, షేక్ అబ్దుల్ మజీద్, తూము అంజయ్య, కోటేశ్వరరావు, బత్తుల శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.




కాంగ్రెస్‌లో చేరిన వారితో భట్టి విక్రమార్క, నాయకులు

వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే..

టీపీసీసీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి

సత్తుపల్లిటౌన్/తల్లాడ/ఖమ్మం వన్‌టౌన్: అందరి దీవెనలతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి ఇందిరమ్మ రాజ్యాన్ని స్థాపించడం ఖాయమని కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సత్తుపల్లి పట్టణంతో పాటు తల్లాడ మండలం నరసింహారావుపేట గ్రామంలో పలువురి కుటుంబాలను సోమవారం ఆయన పరామర్శించాక మాట్లాడారు. కాంగ్రెస్ చేసేదే చెబుతుందని.. ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందని పొంగులేటి స్పష్టం చేశారు. కాగా, ఖమ్మంకు చెందిన పలువురు సోమవారం పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షాన కాంగ్రెస్‌లో చేరారు. ఈమేరకు పారా సాయిఉదయ్‌కిరణ్‌తో పాటు సుమారు 200 మందికి పొంగులేటి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. యువతకు ప్రాధాన్యత కల్పించడంలో కాంగ్రెస్ ముందుంటుందని, అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతీ అభ్యర్థికి ఉద్యోగాలిస్తామని చెప్పారు. ఈకార్యక్రమాల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, సత్తుపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, నాయకులు కొండూరు సుధాకర్, మందపాటి ముత్తారెడ్డి, తుళ్లూరి బ్రహ్మయ్య, ఉడతనేని అప్పారావు, మౌలాలీ, దూదిపాల రాంబాబు, మారుతి బాబురావు, మొండెద్దు కృష్ణారెడ్డి, కొత్తూరు కోటేశ్వరరావు, నాగరాజు, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, తుమ్మలపల్లి రమేష్, గొడుగునూరి లక్ష్మీరెడ్డి, పొట్టేటి జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న శ్రీనివాసరెడ్డి

లోటు వర్షపాతమే

- జూన్, ఆగస్టు, సెప్టెంబర్‌ల్లో సాధారణం కంటే తక్కువ వానలు
- జూలైలో మాత్రం అత్యధిక వర్షపాతం
- సాగర్ నీరు విడుదల కాక తగ్గిన సాగు విస్తీర్ణం



పూత దశకు వచ్చిన పత్తి మొక్కలు

ఖమ్మంవ్యవసాయం: వాతావరణ శాఖ ముందు నుంచి చెప్పిన విధంగానే ఈ ఏడాది వర్షాలు తగ్గాయి. గడిచిన కొన్నేళ్లుగా సీజన్‌లో సాధారణానికి మించి వర్షాలు కురుస్తున్నాయి. కానీ ఈ సారి సాధారణ స్థాయిలోనూ వర్షపాతం నమోదు కాలేదు. తొలకరిలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదురుకాగా.. జూన్‌లో సాధారణ వర్షపాతం 124.6 మి.మీ.కు గాను కేవలం 49.5 మి.మీ.గా నమోదు కావడంతో 60.2 శాతం లోటు నెలకొంది. ఇక జూలైలో మాత్రం సాధారణ వర్షపాతం 249.6 మి.మీ.కు గాను 445.6 మి.మీ.లు(78.5శాతం అధికం)గా నమోదు కావడం విశేషం. ఆతర్వాత ఆగస్టులో సాధారణ వర్షపాతం 249.0 మి.మీ.కు కేవలం 64.8 మి.మీ.లు(73.9 శాతం లోటు), సెప్టెంబర్‌లో 183.7 మి.మీ.కు 154.2 మి.మీ.(16.0 శాతం లోటు) వర్షపాతం నమోదైంది. కాగా, జూన్ నుంచి సెప్టెంబర్ వరకు మొత్తం 49 రోజులు మాత్రమే వర్షాలు కురవగా... జిల్లాలోని 21 మండలాలకు ఆరు మండలాల్లో లోటు వర్షపాతం, మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

జూలై వానలతోనే సాగు

జూలైలో కురిసిన వానలు కొంత మేర పంటల సాగుకు ఉపకరించాయి. ఆ నెలలో సాధారణానికి మించి వర్షాలు కురవడంతో జలాశయాల్లోకి నీరు చేరింది. దీంతో జిల్లాలో ప్రధాన పంట అయిన వరి సాగు ముందుకు సాగడమే కాక మిర్చి సాగుకు కూడా ఊతమిచ్చిందని చెప్పొచ్చు. జూన్‌లో వర్షాలు లేకపోవటంతో పత్తి సాగుపై ప్రభావం చూపగా, గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది అన్ని పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గత ఏడాది వానాకాలం సీజన్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి 7,03,975 ఎకరాల్లో సాగు కాగా, ఈ ఏడాది 5,67,181 ఎకరాల్లోనే సాగయ్యాయి. తద్వారా 1,36,794 ఎకరాల్లో సాగు వెనకబడిందని చెప్పాలి.

సాగర్ ఆయకట్టు వెలవెల

జిల్లాలో సింహభాగం ఆయకట్టుకు నాగార్జున సాగర్ జలాలు ఆధారం. అయితే, ఈ ఏడాది కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో ఆశించిన మేర వర్షాలు లేక ప్రాజెక్టులోకి నీరు చేరలేదు. దీంతో ఆయకట్టుకు నీరు విడుదల చేయకపోవడంతో జిల్లా రైతులు పంటలు వేయలేకపోయారు. జిల్లాకు సాగర్ నీటిని విడుదల చేస్తే జలాశయాలు నిండి భూగర్భ జలాలు పెరుగుతాయి. దీంతో వానాకాలం పంటలకే కాక యాసంగి సాగుకు సైతం ఉపకరిస్తుంది. అయితే, ఈసారి ఆ పరిస్థితి లేకపోవడంతో ఆయకట్టులో చాలాచోట్ల బీడు భూములే దర్శనమిస్తున్నాయి.

జూన్ 1 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు అత్యధిక లోటు వర్షపాతం నమోదైన మండలాలు

మండలం	సాధారణ వర్షపాతం	నమోదు మి.మీ.ల్లో	లోటు (శాతం) మి.మీ.ల్లో
ముదిగొండ	761.2	505.6	33.6
కల్లూరు	855.3	592.0	30.8
పెనుబల్లి	859.5	610.4	29.0
చింతకాని	764.3	553.6	27.6
కొణిజర్ల	791.1	577.4	27.0
నేలకొండపల్లి	751.9	608.2	19.1

దాతల సహకారం మరువలేనిది

- ఆలయ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి
- సన్మాన కార్యక్రమంలో ఈఓ రమాదేవి

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని ఈఓ రమాదేవి అన్నారు. ఇప్పటివరకు సహకరించిన దాతలను స్థానిక టీటీడీ సత్రంలో సోమవారం ఘనంగా సత్కరించారు. దేవస్థానానికి బంగారు, వెండి ఆభరణాలు, వస్త్రాలు, వస్తువులు అందించిన వారితో పాటు, అన్నదానం, వసతి వంటి వాటికి రూ.లక్షకు పైగా విరాళాలు సమర్పించిన దాతలను కార్యక్రమానికి ఆహ్వానించగా, 250 మందికి పైగా దాతలు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాద్రి ఆలయ అభివృద్ధికి దాతలు మరింత మంది ముందుకు రావాలని కోరారు. దాతల సహకారంతో ఇప్పటికే అనేక నిర్మాణాలు జరిగాయన్నారు. అనంతరం దాతలకు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందించారు. కార్యక్రమానికి వచ్చిన దాతలను వేద పండితులు ఆశీర్వదించగా, స్వామివారి దర్శనం, వసతి, భోజన సదుపాయాలు కల్పించారు. అనంతరం రామదాసు కీర్తనలకు చిన్నారులు చేసిన నృత్యం భక్తులను అలరించింది.



దాతలకు స్వామివారి జ్ఞాపిక అందిస్తున్న ఈఓ రమాదేవి

క్లుప్తంగా

ఫ్రెండ్లీ మ్యాచ్‌లో రెవెన్యూ జట్టు విజయం



రెవెన్యూ, ఎలక్ట్రిసిటీ జట్ల సభ్యులు

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సోమవారం ఎలక్ట్రిసిటీ, రెవెన్యూ శాఖల జట్ల మధ్య 16 ఓవర్ల స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో రెవెన్యూ జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఎలక్ట్రిసిటీ జట్టు 76 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెవెన్యూ జట్టు తొమ్మిది వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌ఓ సునీల్‌కుమార్, రామకృష్ణ, షణ్ముఖచారి, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో బాలికల సత్తా



చాంపియన్‌షిప్‌ను అందుకుంటున్న క్రీడాకారులు

బోనకల్: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఖమ్మం జిల్లా బాలికల జట్టు సత్తా చాటింది. నిజామాబాద్ జిల్లా మామిడిపల్లిలో జరిగిన 42వ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి టోర్నీలో జిల్లా బాలికల జట్టు మూడు వరుస సెట్లలో విజయం సాధించి చాంపియన్‌షిప్ కై వసం చేసుకుంది. కాగా, ఈ జట్టులో బోనకల్ క్రీడాకారులు ఎక్కువగా ఉండగా కోచ్ అమిరేసి లింగయ్య తదితరులు అభినందించారు.

బీజేపీతోనే అన్నిరంగాల్లో దేశాభివృద్ధి



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సత్యనారాయణ, నాయకులు

కారేపల్లి: బీజేపీ పాలనలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తెలిపారు. ములుగులో సమ్మక్క–సారక్క పేరిట ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించిన నేపథ్యాన కారేపల్లిలో సోమవారం ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణలోనూ వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని.. తద్వారా రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా శ్యాంరాథోడ్, నాయకులు కె.రాంప్రసాద్, ధనసరి శీర్ను, తురక నారాయణ, నెల్లూరి కోటేశ్వరరావు, బీ.పీ.నాయక్, రవి, ప్రవీణ్, సరస్వతి, సుజాత, వినోద్, మల్లేష్, రామ్మూర్తి, భాస్కర్, రమేష్, మాన్‌సింగ్, జిత్తా నాయక్, శ్రీకాంత్, రఘు పాల్గొన్నారు.

ఈ-పంచాయతీ ఉద్యోగుల సమ్మె



సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులు

ఖమ్మంవన్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు నిరవధిక సమ్మెకు దిగారు. జిల్లాస్థాయిలో పనిచేస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్లకు పే స్కేల్ అమలు చేయాలని, కంప్యూటర్ ఆపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ వర్తింపచేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి అన్ని సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

స్కీం వర్కర్ల సమ్మెకు ప్రభుత్వమే కారణం

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం వర్కర్లు శ్రమదోపిడీకి గురవుతున్నారని... వారి సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడంతోనే సమ్మెకు దిగారని సీఐటీయు ఆల్ ఇండియా కోశాధికారి ఎం.సాయిబాబా పేర్కొన్నారు. ఖమ్మంలో అంగన్‌వాడీలు, ఆశాల దీక్షకు సోమవారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలన్నింటినీ అంగన్‌వాడీలు, ఆశలు ప్రజల్లోకి తీసుకెళ్తుండగా కనీస గుర్తింపు లేకుండా పోయిందన్నారు. అంగన్‌వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం అమలు చేయడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలనలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ విష్ణువర్ధన్, కళ్యాణం వెంకటేశ్వరరావుతో పాటు నాయకులు మోహన్‌రావు, రమ్య, కోటేశ్వరి, సుధారాధ, మంగమ్మ పాల్గొన్నారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.13,026

అభివృద్ధే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యం

- సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య
- ఎన్నికలప్పుడే వచ్చే నాయకుల మాటలు నమ్మొద్దు



తల్లాడ : గృహలక్ష్మి మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

తల్లాడ: తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం అభివృద్ధి మాత్రమేనని.. అందుకే అన్నివర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వెల్లడించారు. తల్లాడ మండలం బిల్లుపాడులో రూ.25లక్షలతో నిర్మించే కమ్యూనిటీ హాల్, అన్నారుగూడెంలో సీసీ రోడ్డు, గృహలక్ష్మి ఇంటి నిర్మాణానికి ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. అలాగే, జెడ్పీహెచ్‌ఎస్‌లో రూ.7లక్షలతో ఏర్పాటుచేసిన సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.

అనంతరం తల్లాడ ఆర్‌బీ గార్డెన్‌లో గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ పట్టణాలతో సమానంగా గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. అయితే, ఎన్నికల మాత్రమే వచ్చి మాయమాటలు చెప్పే వారిని నమ్మకుండా పనిచేస్తే తమ ప్రభుత్వాన్ని మరోమారు ఆదరించాలని కోరారు. సత్తుపల్లి నియోజకవర్గంలో దళితులందరికీ దళితబంధు పథకం వర్తించనుందని తెలిపారు. ఈసందర్భంగా అన్నారుగూడెంలో వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, వైరా మార్కెట్ వైస్ చైర్మన్ డి.భద్రరాజు, తల్లాడ సొసైటీ అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు డి.వెంకట్‌లాల్, ఎంపీడీఓ కె.శ్రీదేవి, ఏఈ అశోక్, ఎస్ఐ సురేష్, నాయుకులు దగ్గుల శ్రీనివాసరెడ్డి, దిరిశాల దాసురావు, మాగంటి కృష్ణయ్య, అయిలూరి లక్ష్మీ, తూము వీరభద్రరావు, సుదర్శన్, దొడ్డా చిన్న శ్రీను, మాదినేని నర్సింహారావు, శీలం కోటారెడ్డి పాల్గొన్నారు.

750 మందికి 'గృహలక్ష్మి'

కల్లూరురూరల్: మండలంలోని 31 గ్రామాల్లో 750 మందికి మొదటి విడతగా గృహలక్ష్మి మంజూరైందని మంజూరు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. ఈసందర్భంగా సోమవారం ఆయన మంజూరు పత్రాలు అందజేసి మాట్లాడారు. 55 ఏళ్లలో కాంగ్రెస్ చేయలేని పనులెన్నింటినో కేసీఆర్ చేసి చూపించారని తెలిపారు. ఎంపీపీ బీరవల్లి రఘు, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, ఎంపీడీఓ రవికుమార్‌తో పాటు డాక్టర్ లక్కినేని రఘు, పాలెపు రామారావు, కాటమనేని వెంకటేశ్వరరావు, ఎం.డీ.ఇస్మాయిల్, ఎస్.కే.కమ్లి పాల్గొన్నారు.

● గాంధీజీకి ఘన నివాళి



ఖమ్మం వన్‌టౌన్ : గాంధీ జయంతి సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మధిర : బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పించిన సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వ, పార్టీ కార్యాలయాల్లో ఆయన చిత్రపటం వద్ద అధికారులు, నాయకులు నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ పాత్రను వివరించిన వారు ఆయనను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అలాగే, మాజీ ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా ఆయనకు సైతం నివాళులర్పించారు.



ఖమ్మం సహకారనగర్ : కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, మధుసూదన్



ఖమ్మం సహకారనగర్ : గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ గౌతమ్

రేపు గిరిజన సంక్షేమ భవన్ ముట్టడి



సమావేశంలో మాట్లాడుతున్న చావా రవి

ఖమ్మం సహకారనగర్: సాధారణ ఉపాధ్యాయులతో పాటే గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలనే డిమాండ్‌తో ఈనెల 4న హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ భవన్ ముట్టడి చేపడుతున్నట్లు టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి తెలిపారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గిరిజన పాఠశాలల్లో బదిలీలు, పదోన్నతులు లేక విద్యావ్యవస్థ కుంటుపడిందని, పర్యవేక్షణ లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈమేరకు పాఠశాలలకు నూతన పోస్టులు మంజూరు చేయడమే కాక మౌలిక వసతులు కల్పించాలని, ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాగా, పాఠశాల విద్యాశాఖలో ఇప్పటివరకు పీజీ హెచ్ఎం బదిలీలు, పదోన్నతులు, స్కూల్ అసిస్టెంట్ల బదిలీ పూర్తయినందున స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులు, ఎస్టీటీల బదిలీలు కూడా పూర్తి చేయాలని చావా రవి డిమాండ్ చేశారు. ఈసమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, నాయకులు వెంకన్న, రాంబాబు, రంజాన్, బి.రాందాస్, నాగేశ్వరరావు, సురేష్ డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'సంక్షోభం నుంచి సంక్షేమ బాట' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన గుమ్మడి నర్సయ్య, తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు సంక్షోభంలో కూరుకుపోయాయని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య వెల్లడించారు. ఖమ్మంలోని టెండర్ రూట్స్ స్కూల్‌లో రిటైర్డ్ ఉద్యోగి కోమాకుల సీతారాములు రచించిన 'సంక్షోభం నుండి సంక్షేమ బాట' పుస్తకాన్ని నర్సయ్య సోమవారం ఆవిష్కరించారు. జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్య బాధ్యతల నుంచి తప్పించుకునేందుకు చూస్తోందని విమర్శించారు. గిరిజన సంక్షేమ శాఖలో విధులు నిర్వర్తించిన సీతారాములు తన అధ్యయనంలో వెల్లడైన అంశాలను ఈ పుస్తకంలో పొందుపర్చారని, ఇవి నేటి సమాజానికి ఉపయోగపడుతాయని తెలిపారు. రచయిత సీతారాములు మాట్లాడగా జాషువా సాహిత్య వేదిక అధ్యక్షుడు మువ్వా శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కస్తాల సత్యనారాయణతో పాటు రవిమారుత్, చావా రవి, వి.మనోహర్‌రాజు, ఖుర్షీద్, మద్దెర్ల రమేష్, పంజాల ఐలయ్య, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, కొంగ్రు బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పదోన్నతులు ఆపొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సైదులు

ఖమ్మం సహకారనగర్: టెట్ అర్హత సాకుతో వేలాది మంది ఉపాధ్యాయుల పదోన్నతులను నిలిపివేయొద్దని స్కూల్ టీచర్స్ ఎడరేషన్(ఎస్‌టీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2010కి ముందు సర్వీస్‌లో చేరిన ఉపాధ్యాయులకు ఎస్‌సీటీఈ నిబంధనల ప్రకారం టెట్ అర్హత మినహాయింపు ఉన్నందున ప్రభుత్వం కోర్టు అనుమతితో అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలన్నారు. అలాగే, జీఓ 15 ద్వారా ఎస్‌ఏలుగా ఉన్నతీకరించిన 10,479మంది పండిట్, పీఈటీ పోస్టులను హైకోర్టు తీర్పు ప్రకారం ప్రస్తుత షెడ్యూల్‌లోనే పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. ఈసమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.యాదగిరి, ఎస్.కే.మన్సూర్‌తో పాటు నాయకులు పోతగాని వెంకన్న, కరీముల్లా, సుధాకర్, పాశం శ్రీను, నాగేశ్వరరావు, ఎస్‌కె.మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో నిరసన



నిరసనలో పాల్గొన్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: మీడియా రంగాన్ని పరిరక్షించడంతో పాటు జర్నలిస్టుల భద్రత కోసం పటిష్టమైన చట్టాలు తీసుకురావాలనే డిమాండ్తో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ చౌక్‌లోని గాంధీ విగ్రహం వద్ద యూనియన్ రాష్ట్ర నాయకుడు నర్వనేని వెంకట్రావు, జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మీడియాతో పాటు మీడియాలో పనిచేసే వ్యక్తుల భద్రత కోసం చట్టం తీసుకురావాలని, జర్నలిస్టుల రైల్వే పాస్‌లు పునరుద్ధరించాలని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఖదీర్, ఆవుల శ్రీనివాస్, కనకం సైదులు జనాత శివ, దువ్వా సాగర్, తాళ్లూరి మురళి, జనార్దనాచారి, రమేశ్, పెండ్ర అంజయ్య, కళ్యాణ్, సత్యనాయణ, మామిడాల భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

నేలకొండపల్లి: మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరఫరా కాక ఆరు నెలల నుంచి ఇబ్బంది పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ మండలంలోని గువ్వలగూడెం మహిళలు సోమవారం ఖమ్మం-కోదాడ ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో రాస్తారోకో నిర్వహించారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోగా నేలకొండపల్లి ఎంపీడీఓ కె.జమలారెడ్డి, ఎస్సై సతీష్ చేరుకుని వారితో మాట్లాడారు. అయినా ఫలితంగా లేకపోవడంతో 40 నిమిషాల పాటు రాస్తారోకో సాగింది. చివరకు సమస్యను సత్వరమే పరిష్కరిస్తామని ఎంపీడీఓ హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఈమేరకు యంత్రాంగం సాయంత్రంకల్లా నూతనంగా బోరు వేయించేందుకు ఏర్పాట్లు చేసింది. సర్పంచ్ వంగూరి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ వంగూరి ఉషతో పాటు జిల్లపల్లి నాగేశ్వరరావు, నాగరాజు, బిక్షం, వెంకమ్మ, కోటమ్మ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు

పెనుబల్లి: మండలంలోని రెండు చోట్ల సోమవారం జరిగిన ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. దమ్మపేట రేంజ్ బీట్ ఆఫీసర్ కె.వెంకటేశ్వరరావు కల్లూరు నుండి జగన్నాథపురానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పెనుబల్లి మండలం గౌరారం టోల్‌ప్లాజా సమీపాన కొత్తగూడెం వైపు నుండి ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటేశ్వరరావుకు తీవ్ర గాయాలు కాగా ఖమ్మం తరలించారు. అలాగే, మండలంలోని ముత్తగూడెం వద్ద తిరువూరు వెళ్తున్న ఓ కారును ఇంకో కారు డ్రైవర్ ఓవర్ టేక్ చేసే క్రమాన అదుపుతప్పి ఢీకొనడంతో ఒక కారు బోల్తా పడింది. ఈ ఘటనలో మహిళ, డ్రైవర్‌కు గాయాలు కావడంతో తిరువూరు ఆస్పత్రికి తరలించారు.

కొణిజర్లలో ఇరువర్గాల ఘర్షణ

సర్పంచ్ వర్గం – బస్వాపురం యువకుల నడుమ గొడవ



ఆందోళన చేస్తున్న సర్పంచ్ అనుచరులు

కొణిజర్ల: కొణిజర్ల సర్పంచ్ సూరంపల్లి రామారావుపై మండలంలోని బస్వాపురానికి యువకులు దాడికి ప్రయత్నించగా స్థానికులు వారిపై ప్రతిదాడి చేసిన ఘటన సోమవారం రాత్రి జరిగింది. రెండు రోజుల క్రితం సర్పంచ్ రామారావు ధర్నా చేసిన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు రూ.లక్షల అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. దీనికి ప్రతిగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వై.చిరంజీవి తదితరులు రామారావును దూషించడంతో ఇరువర్గాల వారు ఘర్షణకు దిగగా పోలీసులు సర్దిచెప్పారు. తిరిగి సోమవారం రాత్రి రామారావు ద్విచక్రవాహనంపై పోలీస్‌స్టేషన్ నుంచి ఇంటికి వెళ్తుండగా బస్వాపురానికి చెందిన కొందరు యువకులు అయనపై దాడికి యత్నించారు. అక్కడే ఉన్న యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ఒక్కసారిగా సదరు యువకులను కొట్టారు. ద్విచక్రవాహనాన్ని తగలబెట్టేందుకు ప్రయత్నించగా వైరా సీఐ సాగర్‌నాయక్, ఎస్ఐలు శంకరరావు, మేడా ప్రసాద్ చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ వర్గీయులు రాస్తారోకోకు దిగగా సర్దిచెప్పి పంపించారు.

మహిళ ఆత్మహత్య

కల్లూరు: మండలంలోని తాళ్లూరుకు చెందిన ఓ మహిళ అనారోగ్య కారణాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. తాళ్లూరుకు చెందిన దాసరి జమలమ్మ(32) కొంత కాలంగా ఫిట్స్‌తో బాధపడుతోంది. ఈ బాధ తట్టుకోలేక ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయాన పురుగుల మందు తాగగా, కాసేపటికి గుర్తించిన కుటుంబీకులు కల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఇంకో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జిల్లా టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక



జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: రెండు రోజులు పాటు ఖమ్మంలో జరిగిన టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీలకు వంద మంది క్రీడాకారులు హాజరుకాగా, ప్రతిభ కనబర్చిన వారితో జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఓలేటి సాంబమూర్తి తెలిపారు. ఈ జట్లు 16వ తేదీ నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని వెల్లడించారు. ఈమేరకు అండర్-11 బాలుర జట్టుకు శ్రీయాన్, హితేజ్, ఈ.హరి, తరుణ్, ఫెజాల్, బాలికల విభాగంలో వంశిక, సాయి శివాని, కీర్తన, సాయి ప్రవంతి, అండర్-13 బాలురలో జ్వాలిత్, చార్విక్, ఉజ్వల్, యశ్వంత్, బాలికల విభాగంలో స్పందన చంద్ర, సంగీత, సౌమ్య, హర్షిత, అనుష్క ఎంపికయ్యారని తెలిపారు. అలాగే, అండర్-15 బాలుర విభాగంలో మోహిత్ కృష్ణ, అజయ్, గోపీచంద్, స్నేహిత్, బాలికల విభాగంలో సిరి, జాయసి, కల్పక బిందు, ప్రియ, సిరివెన్నెల, అండర్-17 బాలుర విభాగంలో ఖాదర్ బాషా, మోహిత్ చార్వి, బాలికల విభాగంలో నిషో, విద్యా, స్నేహిత, కల్పన, సుప్రియ, అండర్-19 బాలికల విభాగంలో కుమారి, తరుణ్య, గాయత్రి, రేఖ ఎంపికయ్యారని వివరించారు.

దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

బిషప్‌ల సమావేశంలో విజయమోహన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌మోహన్‌రావు

ఖమ్మంగాంధీచౌక్: అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ఉండి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఏసీఈ(యాంజిలికాన్ క్లెర్జీ ఎపిస్కోపల్) డయోసిస్ సంస్థ ఫౌండర్ బిషప్ సీహెచ్.విజయ్‌మోహన్‌రావు తెలిపారు. ఖమ్మంలో సోమవారం రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 40 మంది బిషప్‌ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విజయ్‌మోహన్‌రావు మాట్లాడుతూ మణిపూర్ మాదిరి అల్లర్లు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. మణిపూర్‌లో పర్యటించిన తమ బృందం బాధితులకు ఆర్థికసాయం అందిందని తెలిపారు. ఈమేరకు బిషప్‌లు ప్రసాద్, కోట దయానంద్, ప్రభాకర్, నిర్మలాకుమార్, కాంతారావు, పీటర్ నాయక్, జెర్మియా, ప్రకాష్, డాక్టర్ ప్రవీణ్, సీహెచ్.ప్రమోద్‌ను సన్మానించాఉ. ఈ కార్యక్రమంలో యూత్ జి.శామ్యూల్, షాలేం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమితో బీజేపీ వెన్నులో వణుకు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



రాజేశ్వరపురంలో కనకయ్యను పరామర్శిస్తున్న తమ్మినేని

నేలకొండపల్లి: కేంద్రంలోని మతోన్మాద ప్రభుత్వాన్ని గద్దె దించడమే ఏకైక లక్ష్యంగా వామపక్షాలు, కాంగ్రెస్, ఇతర సెక్యూలర్ పార్టీలతో ఇండియా కూటమి ఏర్పడడంతో బీజేపీ వెన్నులో వణుకు మొదలైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండలంలోని రాజేశ్వరపురంలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీటీసీ రాసాల కనకయ్యను సోమవారం పరామర్శించాక ఆయన మాట్లాడారు. బీజేపీ అరాచకం, అణిచివేత, మతోన్మాద పోకడలతో అనాగరిక పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. మణిపూర్ మారణకాండ నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు మహిళా రిజర్వేషన్ బిల్లును తెరపైకి తీసుకొచ్చారని తెలిపారు. ఇక రాష్ట్రంలో ప్రజలకు కేసీఆర్ ఇచ్చిన ఇచ్చిన హామీలను విస్మరించి మరోమారు మోసం చేసేందుకు కుట్ర పన్నారని చెప్పారు. రుణమాఫీ అమలుకాక రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, కే.వీ.రెడ్డి, రచ్చా నరసింహారావు, కట్టికోల వెంకన్న, చింతలపాటి భాస్కర్, మండడపు మురళి, యలమద్ది వెంకటేశ్వరరావు, యలమద్ది లెనిన్, రాజశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్‌కు పలువురి పరామర్శ







నివాళులర్పిస్తున్న ఎంపీ రవిచంద్ర, కలెక్టర్ గౌతమ్, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

వైరారూరల్: జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ తల్లి లింగాల దేవకరుణమ్మ మృతి చెందగా, మండలంలోని కోస్తాలలో ఆమె మృతదేహం వద్ద సోమవారం పలువురు నివాళులర్పించారు. అలాగే, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, ఆయన కుటుంబీకులను పరామర్శించారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి, కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జెడ్పీ సీఈఓ అప్పారావు, తహసీల్దార్ శ్రీనివాసరావుతో పాటు వివిధ పార్టీల నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు, పోటు ప్రసాద్, మాలోతు రాందాస్‌నాయక్, బానోతు బాలాజీనాయక్, దాసరి దానియేలు, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, శీలం వెంకటనర్సిరెడ్డి తదితరులు ఆమె మృతదేహం వద్ద నివాళులర్పించారు. కాగా, దేవకరుణమ్మ అంత్యక్రియలను సోమవారం మధ్యాహ్నం నిర్వహించారు.